క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన కృష్ణమూర్తి

బలిజిపేట: పెదపెంకిలో స్నేహచైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేతాజీ గ్రంథాలయం వద్ద శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్నేహచైత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ దీనిని రాబోయే 3నెలల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. వేసవిలో బాటసారులకు దాహార్తి తీర్చేందుకు ఇటువంటి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సంజీవనాయుడు, శ్రవణ్, గౌరీనాథ్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ



కలశాలతో తిరువీధి చేస్తున్న మహిళలు

మక్కువ: స్థానిక బీసీ కాలనీలో శుక్రవారం ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. వేదపండితులు ఆరవెల్లి విజయ్‌కుమార్ శర్మ వేదమంత్రోచ్ఛరణలో ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడుతో పాటు, భక్తులు పాల్గొని, పూజలు చేశారు. మహిళలు కలశాలతో, ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులతో తిరువీధి నిర్వహించారు.

విద్యుత్ కోసం ఆందోళన



మక్కువ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి సబ్‌స్టేషన్ పరిధిలో తమ పంట పొలాలకు పూర్తి స్థాయి విద్యుత్ సరఫరా అందించడం లేదంటూ రైతులు ఆందోళనకు దిగారు. మక్కువ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రైతులు శుక్రవారం చేరుకొని ఆందోళన చేపట్టారు. రోజుకు కనీసం నాలుగు గంటలు విద్యుత్ సరఫరా అందడం లేదని, పంటలు ఎండిపోతున్నాయంటూ ఆవేదన చెందారు. విద్యుత్ సరఫరా పూర్తి స్థాయిలో అందించకపోతే ఆందోళన చేపడతామని, రైతులు హెచ్చరించడంతో, సబ్ ఇంజినీర్ శివశంకర్ మాట్లాడుతూ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజులావీణ

మక్కువ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రిన్సిపాల్ మంజులావీణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ములక్కాయవలస, మక్కువ గ్రామాలలో ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రరావు, పీఏ ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐగా ఎంపికైన మహిళ పోలీస్



మహిళ పోలీసు భవ్యను అభినందిస్తున్న ఎంపీడీఓ

పార్వతీపురం టౌన్: మండలంలోని నర్సిపురం సచివాలయ మహిళ పోలీసుగా పని చేస్తున్న అదే గ్రామానికి చెందిన వేంపల్లి భవ్య ఎస్ఐ పోస్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా పార్వతీపురం మండల కార్యాలయంలో ఎంపీడీఓ అకిబ్ జావేద్, ఎంపీపీ మజ్జి శోభారాణి ఆధ్వర్యంలో శుక్రవారం భవ్యను సన్మానించారు. మహిళ ఎస్ఐగా అంకిభావంతో పని చేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

యంత్ర పరికరాల సరఫరాకు టెండర్లు

సీతంపేట: పీఎం జనమన్ పథకంలో భాగంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలో గల 53 పీవీటీజీ వీడీవీకే కేంద్రాలకు అవసరమయ్యే యంత్ర పరికరాల సరఫరాకు శుక్రవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో టెండర్లు నిర్వహించారు. 20 రకాల పరికరాలకు టెండర్లు జరగ్గా ఐదుగురు సరఫరాదారులు హాజరయ్యారు. ఏపీఓ రోసిరెడ్డి, జీసీసీ డీఎం సంధ్యారాణి, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, పీఏఓ హరికృష్ణ, పీహెచ్ఓ గణేష్ పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేయడమే నా అజెండా..

- తహసీల్దార్ కార్యాలయానికి నిధులు మంజూరు చేయించింది నేనే...
- టీడీపీ నేతలు ఫొటోలకు ఫోజులివ్వడం విచారకరం
- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా ప్రజలకు మంచి చేయడమే నా అజెండా అని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సాలూరు తహసీల్దార్ కార్యాలయం మేమే నిర్మాణం చేసామంటూ మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి సెల్ఫీ తీసుకుని ప్రచారం చేసుకోవడంపై రాజన్నదొర ఘాటుగా స్పందించారు. అలా ఫొటోలు తీసుకుని, ప్రచారం చేసుకోవడానికి సంధ్యారాణికి, టీడీపీ నాయకులకు సిగ్గుండాలని ధ్వజమెత్తారు. సాలూరు తహసీల్దార్ కార్యాలయానికి తాను నిధులు తీసుకువచ్చి నిర్మాణం పూర్తి చేయించానని స్పష్టం చేశారు. ధర్మాన ప్రసాదరావు రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు రూ.40 లక్షలతో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. నిధులు చాలకపోతే రఘువీరారెడ్డి రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో మరో 10 లక్షల రుపాయిలు తీసుకువచ్చి నిర్మాణం పూర్తి చేయించానని గుర్తు చేశారు. తరువాత ఎన్నికల కోడ్ రావడంతో భవన ప్రారంభోత్సవం చేయలేదని తెలిపారు. కాగా 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యేగా అధ్యక్ష స్థానంలో నేను ఉండాల్సి ఉండగా ప్రొటోకాల్ విస్మరించి ఈ భవన ప్రారంభోత్సవం నాడు టీడీపీ నాయకులు చేశారని వివరించారు. గత టీడీపీ పాలనలో నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.90 కోట్ల నిధులను ఎమ్మెల్యేగా తాను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మంజూరు చేయించగా, నాటి మంత్రి కిమిడి మృణాళిని అంగీకరించారని అన్నారు. నాకు నియోజకవర్గ అభివృద్ధి ముఖ్యమని, మంజూరైన ఆ అభివృద్ధి పనులు మీ టీడీపీ నాయకులే చేసుకోండని నాడు నేను తెలిపినప్పటికి, నేను వీటిని మంజూరు చేయించాననే ప్రధాన కారణంతో ఆ పనులను అడ్డుకున్న ఘనత సంధ్యారాణి, భంజ్‌దేవ్‌లకే దక్కుతుందని విమర్శించారు. 100 పడకల ఆస్పత్రిపై టీడీపీ నాయకులు విమర్శలు చేయడంపై ఆయన మండిపడ్డారు. 100 పడకల ఆస్పత్రికి గత టీడీపీ నాయకులు రాత్రివేళ కొబ్బరికాయలు కొట్టి ఎన్నికల వేళ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని అవరోధాలు అధిగమించి ఆ పనులు ప్రారంభించామని, పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. నేడు పనులు తుదిదశకు చేరుకున్నాయని వెల్లడించారు. టీడీపీ నాయకులు వస్తే జరుగుతున్న పనులు చూడవచ్చని తెలిపారు. నియోజకవర్గంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధిని చూసి టీడీపీ నాయకులు ఓర్వలేక బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

అభ్యసనాభివృద్ధితో నైపుణ్యాలను పెంచవచ్చు



బలిజిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న అధికారిణి కల్పన

బలిజిపేట: అభ్యసనాభివృద్ధి కార్యక్రమంతో విద్యార్థులలో నైపుణ్యాలను పెంచవచ్చని లిప్ స్టేట్ నోడల్ అధికారిణి కల్పన తెలిపారు. బలిజిపేట ఉన్నత పాఠశాలను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె 8వ తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ప్రశ్నించారు. విద్యార్థులు తెలిపిన సమాధానాలపై కొంతమేర సంతృప్తి చెంది, కొన్ని సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న లిప్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలకు వెనుక భాగంలో ఉండే కీలక పదాలపై దృష్టి సారిస్తే వారిలో మంచి భాషా నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. అభ్యసనాభివృద్ధిలో భాషా సంబంధిత విషయాలను విద్యార్థులకు అందించి వారిలో చదవడం, రాయడం నైపుణ్యాలు, మెలుకువలు వారికి బాగా నేర్పిస్తే ఎంతో మంచిదన్నారు.

ముఖ్యంగా ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులు మంచి నైపుణ్యత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జయప్రసాదు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసమే 'ఆరోగ్య సురక్ష'



జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరంలో జెడ్పీటీసీ రవికుమార్, అధికారులు

బలిజిపేట: ప్రజారోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు ప్రజలు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ అన్నారు. చిలకలపల్లిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జెడ్పీటీసీ హాజరయ్యారు. శిబిరానికి వచ్చే రోగులకు సంపూర్ణ వైద్యసేవలు అందించాలని వైద్య బృందాన్ని కోరారు. రోగుల వద్ద కూర్చుని వైద్యసేవలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

ఈ పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రజలు భావించి ఇటువంటి వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరరావు, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైద్యాధికారిణి కిరణ్మయి, ఎంపీడీఓ ఎన్.రమేష్‌నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, టి.ప్రసాదరావు, ఎస్.భాస్కరరావు, కె.వెంకటరమణ, ఎ.పోలినాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్విఫ్ట్ చార్ట్ యాప్‌లో టీచర్లు రిజిస్ట్రేషన్ కావాలి

పార్వతీపురం టౌన్: స్విఫ్ట్ చార్ట్ యాప్‌లో ఉపాధ్యాయులంతా విధిగా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఎంఈఓ సామల సింహాచలం అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. బ్లాక్‌బోర్డు స్థానంలో ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌లను పాఠశాలల్లో ఏర్పాటు చేసి, ఆధునిక విద్యాబోధనను అమల్లోకి ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. విద్యాబోధనలో ఉపాధ్యాయులకు సహాయకారిగా ఉండేందుకు స్విఫ్ట్ చార్ట్ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఉపాధ్యాయులు తమ చేతిలోని స్మార్ట్‌ఫోన్ ద్వారా ఎటువంటి ప్రశ్నకైన సమాధానాన్ని కనుగొని నూతన విధానంలో తాజాగా స్విఫ్ట్ చాట్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాంపై పనిచేసే విధంగా దీనిని రూపొందించారన్నారు.

మున్సిపల్ పాఠశాల సందర్శన

పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలో నేతులవారి వీధి, మేదరవీధి మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీలను, లెసెన్ ప్లాన్‌లను తనిఖీ చేశారు. విద్యా సంవత్సర క్యాలెండర్ ప్రకారం సిలబస్‌ను పూర్తి చేశారా.. లేదా.. అని ఆరా తీశారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

అలసత్వం వహిస్తే సహించేది లేదు...



రియా ఆస్పత్రిలో వైద్య సదుపాయాలపై ఆరా తీస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. శంకరరావు

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డివిజి.శంకరరావు

పాచిపెంట: గిరిజన విద్యార్థుల ఆరోగ్యం విషయంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డివిజి.శంకరరావు అన్నారు. మండలంలోని సరాయివలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలు, సౌకర్యాలు తదితర అంశాలపై మాట్లాడారు. ఇటీవల పాఠశాల విద్యార్థిని మృతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన విద్యార్థిని మృతి బాధాకరమని అన్నారు. మృతికి గల కారణాలతో పాటు మూలాలు కూడా తెలుసుకున్నప్పుడే ఇటువంటి మరణాలు పునరావృతం కావని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో గిరిజన పాఠశాలల్లో అధునాతన సదుపాయాలు, మెరుగైన వసతులు కల్పిస్తున్నామని అన్నారు. విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని అన్నారు. విద్యార్థులకు తరుచూ కింద స్థాయి వైద్యాధికారులు వైద్య పరీక్షలు చేస్తుండాలని, జిల్లా స్థాయి వైద్యాధికారులు పర్యవేక్షణ ఖచ్చితంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం ఆయన మండలంలో గురివినాయుడుపేట పీహెచ్‌సీ, సాలూరు పట్టణంలో ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వారికి అందిస్తున్న చికిత్సపై సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



సుశీల కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పురపాలక సంఘం కొత్తవలస ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు ఎర్రపతుల సుశీల భర్త తిరుపతిరావు ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదానికి గురైన కారణంగా శుక్రవారం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జోగారావు ఆమె కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి

సాలూరు: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు వర్తకులు సహకరించాలని పట్టణ సీఐ జి.దేముడుబాబు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో కోటవీధి సమీపంలో పలువురు వర్తకులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాపార దుకాణాల ముందు రోడ్డుపై వాహనాలు నిలుపుదల చేయవద్దని దుకాణాలకే వచ్చే వినియోగదారులకు సూచించాలని అన్నారు. నిబంధనలకు అనుగుణంగా దుకాణాలు ఉండాలని ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదన్నారు.

తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తప్పవు



ఉపాధి పనుల పరిశీలనలో పీడీ రామచంద్రరావు

జియ్యమ్మవలస: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, తప్పుడు మస్తర్లు వేస్తే చర్యలు తప్పవని ఉపాధి హామీ పథకం పీడీ కె.రామచంద్రరావు హెచ్చరించారు. మండలంలోని గవరమ్మపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. మస్తర్లు తనిఖీ చేసి, పనిలోకి వచ్చిన వేతనదారులకు మాత్రమే మస్తర్లు వేయాలని సూచించారు. పనిలోకి రానివారికి మస్తర్లు వేయొద్దని సూచించారు. రెండు పూటలా నిర్దేశిత కొలతల ప్రకారం వేతనదారులతో పనులు చేయించాలని, సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

కొమరాడ: మండల కేంద్రంలో ఎయిడ్స్ నియంత్రణపై బుర్రకథ రూపంలో కళాకారులు శుక్రవారం అవగాహన కల్పించారు. హెచ్ఐవీ(హ్యూమన్ ఇమ్యూనో వైరస్) ద్వారా సోకే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి ఎయిడ్స్ అని, అవగాహన ఉంటే వ్యాధికి దూరంగా ఉండొచ్చని తెలిపారు. హెచ్ఐవీ సోకిన వ్యక్తి(స్త్రీ)పాలు, లైంగిక సంబంధాలు, రక్తమార్పిడి ద్వారా వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే ఈ వ్యాధి అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని అన్నారు.

ప్రధాని మోదీ తన వైఖరి మార్చుకోవాలి



మృతి చెందిన రైతు శుభకరణ్ సింగ్‌కు జోహార్లు అంటూ ర్యాలీ చేస్తున్న రైతులు, సీఐటీయూ నాయకులు

పాలకొండ రూరల్: హర్యానా సరిహద్దులో తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రైతులు ఆందోళన చేస్తుంటే, వారిపై పోలీసులచే దాడి చేయిస్తున్న ప్రధాని మోదీ తన వైఖరి మార్చుకోవాలని సీఐటీయూ నాయకుడు డి. రమణారావు అన్నారు. ఈ మేరకు అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు, పలు రైతు సంఘాల ప్రతినిధులతో కలసి పాలకొండ పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. రైతులను చర్చలకు పిలిచి తన యంత్రాంగంతో దాడులు చేసి రైతులను మట్టుబెట్టడం సరికాదన్నారు. సోమనాథ్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటలకు మద్దతు ధర కల్పించాలని, రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు శుభకరణ్ సింగ్ మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, కె.రవికుమార్, రామినాయుడు, పాపారావు, కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను ఆదుకుంటుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని జానుమల్లువలసకు చెందిన వాకాడ మౌనిక తల్లి సత్యవతి, బలిజిపేట మండలం మిర్తివలసకు చెందిన సాలీల వెంకటి భార్య పార్వతి, గంగాడ గ్రామానికి చెందిన గంట అప్పలనాయుడు ఇటీవల వేర్వేరు అనారోగ్యాల కారణంగా అప్పులు చేసి అత్యవసర వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. వారి కుటుంబాలకు సీఎం సహాయనిధికి ఎమ్మెల్యే జోగారావు సిఫార్సు చేయగా మంజూరు చేసిన చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు.

ఆయా కుటుంబాలకు మంజూరైన మొత్తం రూ.8.60 లక్షల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గుర్తు పెట్టుకొని తోడుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జానుమల్లువలస సర్పంచ్ వెంకటనాయుడు, పార్టీ బలిజిపేట మండల అధ్యక్షుడు మురళి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట గ్రామ కాలనీ నుంచి పంట పొలాల మధ్య జరుగుతున్న గ్రావెల్ రోడ్డు పనులను జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, పార్టీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేయడంతో లచ్చయ్యపేట శివాలయం జంక్షన్ నుంచి నూకాలమ్మ బంద వరకూ, ఇదే పంచాయతీలో ఉన్న గుమ్మిడివరం గ్రామంలో ప్రాథమిక పాఠశాల నుంచి రైల్వే గేటు వరకూ గ్రావెల్ రోడ్డు వేయనున్నట్టు తెలిపారు. రైతులు పొలాల్లో పండిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులను ఇళ్లకు చేర్చడానికి రహదారి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి తేవడంతో స్పందించి నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో రోడ్డు వైండింగ్, మరమ్మతులు అనంతరం గ్రావెల్ వేయడం జరుగుతుందని తెలిపారు. నిర్దేశించిన రెండు పనులు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో రోడ్డు పనులు జరుగుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.గోపాలనాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరరావు

సీతానగరం: మండలంలో అర్హులైన కుటుంబాలకు మంజూరైన ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను డిజిటల్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు పంపిణీ చేయాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు సూచించారు. మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ డిజిటల్ సహాయకుడు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులతో ఇళ్ల పన్నులు, ఇళ్ల నిర్మాణాలు, తాగునీటి సరఫరా, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించడంతో పాటు ప్రజా సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. గ్రామాల్లో సమస్యలను గ్రామ పెద్దల సమక్షంలోనే పరిష్కరించడానికి కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో డీఏలు, వెల్ఫేర్ సహాయకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చందలింగిలో డ్రైడే ఆరోగ్య సర్వే



డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ జగన్మోహనరావు

- డీఎంఓ డాక్టర్ జగన్మోహనరావు

పార్వతీపురం టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. మండలంలో మారుమూల గ్రామమైన చందలింగిలో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్త వ్యర్థ పదార్థాలను తొలగించారు. ఇళ్ల పరిసరాలలో పాడైన నిరుపయోగంగా ఉన్న వస్తువుల్లో గుర్తించిన నీటి నిల్వలను పారబోయించారు. ఇళ్లల్లో దోమ తెరలు వినియోగిస్తున్న తీరును పరిశీలించారు.

గ్రామస్తులకు ఆయన పరిసరాల పరిశుభ్రత వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పిస్తూ దోమలు వృద్ధి చెందడానికి ప్రధాన కారణంగా ఉన్న నిల్వ నీరు అని ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామంలో ఎవరికైనా జ్వరాలుగాని, ఇతర ఆరోగ్య సమస్యలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. చినమరికి గ్రామంలో వెల్‌నెస్ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సీహెచ్ అధుంజయరావు, సూపర్‌వైజర్ సత్తిబాబు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని సచివాలయ కాలనీకి వెళ్లే దారిలో కొత్తగా సీసీ రోడ్డు నిర్మాణం శుక్రవారం చేపట్టారు. వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్ మాట్లాడుతూ రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం జరుగుతుండడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ బి.గౌరీశంకరరావు పాల్గొన్నారు.